**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 14.03.2026** **సమయం : 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీ లకు 640 కోట్ల రూపాయలను విడుదల చేసింది.
2. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ల సరఫరాలో సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.
3. మహిళల స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.
4. హైదరాబాద్ మహానగరం చుట్టూ ఏర్పాటయ్యే రీజినల్ రింగ్ రోడ్డు పక్కన రీజినల్ రింగ్ రైల్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసినట్టు కేంద్రమంత్రి రవనీత్ సింగ్ వెల్లడించారు.

.............................................................................

**కేంద్ర నిధులు**

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీ లకు 640 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఈ నిధులు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ బకాయిలు. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇంకా 1200 కోట్ల రూపాయల బకాయిలు విడుదల కావలసి ఉన్నదని, వాటిని వెంటనే ఆ నిధులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది.

....డెస్క్

**ఎల్ పి జి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్**

గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ల సరఫరాలో సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ రోజు మంత్రి ఎల్ పి జి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం 810 గ్యాస్ డీలర్లు ఉన్నారని, గ్యాస్ సరఫరాపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని మంత్రి అన్నారు. అలాగే మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి సిలిండర్ల కొరత రాకుండా పర్యవేక్షిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిన్న ఒక్కరోజే అత్యధికంగా 2,37,123 గ్యాస్ సిలిండర్లు పంపిణీ అయ్యాయని సాధారణంగా జరిగే రోజువారీ సగటు పంపిణీ కన్నా, 12 వేల సిలిండర్లు అధికమని ఆయన అన్నారు. గ్యాస్ సిలిండర్లను కృత్రిమ కొరత సృష్టించినా, బ్లాక్ మార్కెట్ కు తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

........డెస్క్

**రామచంద్రరావు**

పశ్చిమాసియాలో సంక్షోభ పరిస్థితుల వల్ల అనేక దేశాల్లో గ్యాస్,ముడి చమురు ధరలు పెరిగాయని, మన దేశంలో మాత్రం మోడీ ప్రభుత్వం వాటి ధరలను నియంత్రణలో ఉంచిందని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు అన్నారు. కొంతమంది దళారులు  వంట గ్యాస్ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని రాజకీయ స్వప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నాయని అన్నారు. కాగా మూసీనది పునరుజ్జీవ ప్రాజెక్టు అంచనాను ఐదు వేల కోట్ల రూపాయల నుంచి ఏడు వేల కోట్ల రూపాయలకు పెంచడం పై రామచంద్రరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తర్వాతే ప్రాజెక్టులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

**బైట్ రామచంద్రరావు...........**

........పిటిసి, హైదరాబాద్

**మహిళా ఉపాధి**

మహిళల ఆర్థిక స్వావలంబనకు, స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేయడానికి ప్రణాళికలు రూపొందించిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఈ రోజ నల్లగొండలో సెట్విన్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 116 మంది మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను మంత్రి అందచేశారు. సెట్విన్ ద్వారా ఇప్పటివరకు 27 కోర్సుల్లో 1250 మంది మహిళలకు శిక్షణ అందించారని, శిక్షణ పొందిన వారు మహిళా సంఘాలుగా ఏర్పడితే వారి ఉపాధి కోసం రుణాలు మంజూరు చేస్తామని మంత్రి వెంకట్ రెడ్డి అన్నారు. కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలను ప్రభుత్వ పాఠశాలలో Instructor లుగా నియమిస్తామని మంత్రి వెల్లడించారు.

......పిటిసి, నల్లగొండ

**ట్రిపుల్ ఆర్**

హైదరాబాద్ మహానగరం చుట్టూ ఏర్పాటయ్యే రీజినల్ రింగ్ రోడ్డు పక్కన రీజినల్ రింగ్ రైల్ ను ఏర్పాటు చేస్తామని దీని డిపిఆర్ కోసం, సర్వేకు అనుమతులు మంజూరు చేసినట్టు కేంద్రమంత్రి రవనీత్ సింగ్ వెల్లడించారు. లోక్ సభలో ఎంపి కిరణ్ కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ నీతి ఆయోగ్ ఆర్థిక శాఖ ఆమోదం తర్వాత ఈ ప్రాజెక్టుకు తుది అనుమతులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

.......... డెస్క్

**గ్యాస్ సిలిండర్లు**

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలలో వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీ గురించి ఈ రోజు కలెక్టర్లు జిల్లా కేంద్రాలలో సమీక్షా సమావేశాలను నిర్వహించారు. వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ల పంపిణీకి పరిమితులు విధించినట్లు సూర్యాపేట్ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్

పవార్ తెలిపారు. గృహవసరాలకు ఉపయోగించే సిలిండర్లను బుక్ చేసుకున్న 2-3 రోజుల్లోనే వినియోగదారులకు సరఫరా చేస్తున్నామని, మహబూబ్ నగర్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా వెల్లడించారు. డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్యపరంగా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంత్ హెచ్చరించారు.

డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కృత్రిమ కొరతను సృష్టించిన వారిపై కేసులు నమోదు చేస్తామని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. డిమాండ్ కు అనుగుణంగా ఏజెన్సీల వద్ద గ్యాస్ సిలిండర్ల నిల్వ సిద్ధంగా ఉందని, సిలిండర్ల కోసం ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు.

ములుగు జిల్లాలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, వినియోగదారులు ఈ విషయంలో ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ టి ఎస్ దివాకర్ అన్నారు. డొమెస్టిక్ సిలిండర్ల కొరత రాకుండా ముందుస్తు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

**ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ బైట్ ............**

..........సూర్యాపేట, జనగామ, ములుగు, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, యాదాద్రి భువనగిరి  పిటిసిలు

**పాదయాత్ర**

రాష్ట్రంలో రాబోయేది భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమేనని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ రోజు కరీంనగర్ లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం వరకు సుమారు 40 కిలోమీటర్ల మేర చేపట్టిన పాదయాత్రను ఆయన  ప్రారంభించారు. జిహెచ్ ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఏకమైనా బిజెపీని ఓడించలేవని బండి సంజయ్ పేర్కొన్నారు.

......డెస్క్

**సీతక్క**

ఢిల్లీలో కేంద్ర  మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణ దేవిని మంత్రి సీతక్క ఆమె నివాసంలో కలిశారు. నిర్భయ నిధి కింద ములుగు జిల్లాకు ప్రత్యేకంగా 10 కోట్ల రూపాయలు కేటాయించినందుకు ఆమె కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

.........పిటిసి, ములుగు

**సాగునీరు**

వేసవిలో రైతులకు సాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం  అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు  ఆది శ్రీనివాస్ అన్నారు.

**ఆది శ్రీనివాస్ బైట్ ..........**

........పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**తుమ్మల – ఆయిల్ ఫామ్**

ఆయిల్ ఫామ్ పంట ఎంతో లాభదాయకమని, రైతులు ఆయిల్ ఫామ్ ను సాగుచేయడం పట్ల ఆసక్తి కనబరచాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ రోజు సిద్దిపేట జిల్లా, నర్మెట్ట లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి సందర్శించారు. ఈ ఫ్యాక్టరీని ఈ నెల 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని మంత్రి వెల్లడించారు.

........పిటిసి, సిద్దిపేట

**జనగణన**

2027 జనాభా లెక్కలు తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి ఎంతో చారిత్రాత్మకమని సెన్సెస్ డైరెక్టర్ భారతీ హోలీకెరీ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి జనగణన ఇదేనని చెప్పారు.

..........డెస్క్

**ఇంటర్ మూల్యాంకనం**

ఇంటర్మీడియట్ విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనం విధులకు అధ్యాపకులను రిలీవ్ చేయని ప్రిన్సిపల్స్, ప్రైవేట్ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది.

.......పిటిసి, నిజామాబాద్

**గోదావరి పుష్కరాలు**

2027 జున్ లో జరిగే గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఈ రోజు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న ఘాట్లను మరమ్మత్తులు చేయించడంతో పాటు అవసరం ఉన్న చోట నూతన ఘాట్ల నిర్మాణం చేపడతామన్నారు. ఈ నెల 27న శ్రీరామనవమి నాడు జరుగనున్న శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, ఐటిడిఏ పిఓ బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట పాల్గొన్నారు.

........పిటిసి, భద్రాద్రి కొత్తగూడెం

**రైల్వే రవాణా**

తెలంగాణ నుంచి ధాన్యం, పత్తి రవాణా కోసం మరిన్ని రైల్వే ర్యాక్స్ లను కేటాయించాలని వరంగల్ ఎం పి కడియం కావ్య కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆమె విన్నపానికి  కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

......డెస్క్